
WE'RE
HIRING
REPORTERS
స్టార్ త్రినేత్రం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
ఆసక్తి గలవారు 9700950084 నెంబర్‌కు మీ రెజ్యూమ్ పంపగలరు.
వెబ్ సైట్: http://www.startrinethram.com

స్టార్ త్రినేత్రం
RNI NO: TELTEL12350
http://www.startrinethram.com
అనుక్షణం అక్షరసత్యం
తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 51 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | బుధవారం 22-1-2025 | పేజీలు : 4 | వెల : 5

# పదేళ్లల్లో ఒక్క రేషన్ కార్డయినా ఇచ్చారా


- ఇస్తున్న మాపైన విమర్శలు చేయడం దారుణం
- ఇలాంటి వారుని ప్రజలు నమ్మొద్దన్న మంత్రి పొన్నం

**హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం :**



పదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు విమర్శలుచేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ది జరుగుతుందని మంత్రి అన్నారు.గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఆయన తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు మంత్రి పొన్నం. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు .. వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారాఅని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుకున్నామని ఆయన తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చాం.. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెల లోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలు ఎవరు అధైర్యపడవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. గ్రామాల్లో నేటి నుండి గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు , ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలి అని, కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల , ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారికి కాంగ్రెస్ క్యాడర్ అండగా నిలబడాలన్నారు.

# పోలీస్ పహారా మధ్య గ్రామసభలు



- ప్రజా వ్యతిరేకతకు ఇదే నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,జనవరి 21 స్టార్ త్రినేత్రం :**

ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. మీ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని అన్నారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు. మీ రాక్షస పాలనలో విసిగి, వేసారిపోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవండని హితవు పలికారు. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం

- గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎపి అవతరణ
- దావోస్ సదస్సులో చంద్రబాబు వివరణ

**దావోస్,జనవరి21 స్టార్ త్రినేత్రం :**



సంప్రదాయేతర ఇంధన వనరులపై తమ ప్రభుత్వం అధిక దృష్టి సారించిందని, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు హైడ్రోజన్ ఎనర్జీ హబ్‌గా ఎపి మారబోతోందని అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 'మిమ్మల్ని అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది. భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయని అన్నారు. 2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల , 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ-ఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతు న్నాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోంది. ఏపీలో విద్యుత్

▶ మిగతా 2లో

# కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు.. వంచన రాజ్యం

- రైతుల శాపనార్థాలతో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుంది
- ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం :**



ఇది రైతు రాజ్యం కాదని, రైతు వంచన రాజ్యమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని మండిపడ్డారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్లలా ప్రాణంతీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలే అని అన్నారు. రుణమాఫీ చేయనందుకే ఈ ఆత్మహత్యలని అన్నారు. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయని చెప్పారు. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయని ఎక్స్ వేదికగా కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివేదికను అందజేస్తుందని కేటీఆర్ తెలిపారు. రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రధానమైన కారణాలతోపాటు రాష్ట్రంలో ఏడాది నుంచి వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదిక తయారు చేస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్నకారు, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటుందని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఆందోళనకర పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని దాటకపోవడం, రైతన్నలకు

▶ మిగతా 2లో

# ప్రతిష్టాత్మకంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ



- పక్కాగా తెలంగాణ భూ భారతి అమలు
- అధికారులతో సమీక్షలో సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్,జనవరి 21 స్టార్ త్రినేత్రం :**

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టంలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని సిఎస్ శాంతికుమారి అన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కార్యాచరణ చేయాలన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 పై మంగళవారం సచివాలయంలో వర్క్ షాప్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వర్క్ షాప్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూ భారతి చట్టం, 2025 వివరించేందుకే ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భూ భారతి చట్టం, 2025పై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలనను క్రమబద్ధీకరించడంతో పాటు జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ విజన్ అని అన్నారు. ఈ చట్టం సమర్థవంతమైన వ్యవసాయ భూ పరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనుసరించి 2024 జూలై 1న ముసాయిదా చట్టాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుండి వచ్చిన పలు సూచనలను స్వీకరించిన తరువాతే ఈ చట్టంను రూపొందించామని ఆయన తెలియజేశారు. శాసనసభ ఆమోదం పొందిన ఈ చట్టాన్ని గౌరవనీయులైన గవర్నర్ కూడా ఆమోదించడంతో ఈ నెల 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడిందన్నారు. యూజర్ ఫ్రెండ్లీ పోర్టల్‌ను తయారు చేయడంతో పాటు అవసరమైన నియమ, నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025 ద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఉద్దేశించిన ముఖ్యాంశాలను వివరించారు.

▶ మిగతా 2లో

స్టార్ త్రినేత్రం
అనుక్షణం అక్షరసత్యం తెలుగు దినపత్రిక
బుధవారం, 22 జనవరి 2025

# సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం

*మొదటి పేజీ తరువాయి...*

ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటు లో పోర్టులు ఉన్నాయి. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుంది. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నాం. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది. రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయంపైనా దృష్టి పెట్టాం. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుంది. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నాను. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో సేవలు అందించాలి. ప్రపంచంలోని అనేక దేశాల్లో రాజకీయ అనిశ్చితి



ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉంది'అని చంద్రబాబు అన్నారు. రెండో రోజు దావోస్‌లో మిట్టల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, సీఈఓ ఆదిత్య మిట్టల్‌తో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్ సమావేశమయ్యారు. ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల కెపాసిటీతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయడానికి ఇప్పటికే అంగీకారం కుదిరిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు ముందుకు తీసుకెళ్లే అంశంపై ముఖ్యమంత్రి బృందం చర్చలు నిర్వహించింది. మరోవైపు వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు ఘనంగా ప్రారంభమైంది. జ్యూరిచ్ కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో ప్రారంభమైన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా హాజరైన పారిశ్రామిక వేత్తలతో పెట్టుబడుల అవకాశాలు, పొటెన్షియల్ కొలాబరేషన్స్‌పై చర్చించారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్ ప్లీనరీ హాలు లాబీలో ఏర్పాటు చేసిన నెట్ వర్కింగ్ డిన్నర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలను పారిశ్రామిక వేత్తలకు సీఎం చంద్రబాబు వివరించారు.

## ప్రతిష్టాత్మకంగా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

*మొదటి పేజీ తరువాయి...*

సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్ లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించడం ద్వారా, రాష్ట్ర వినియోగదారులకు స్వచ్ఛమైన, విశ్వసనీయమైన,సరసమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తూ, రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం ఈ విధానం లక్ష్యం అన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు దానకిషోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేశ్ కుమార్, యోగితా రాణా, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్, ఇతర అధికారులు వర్క్ షాప్‌కు హాజరయ్యారు.

## కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు.. వంచన రాజ్యం

*మొదటి పేజీ తరువాయి...*

కొన్ని సంవత్సరాలుగా అందుతున్న రైతుబంధును ఆపి, ఇస్తామన్న రూ.15 వేల రైతు భరోసాను కూడా ఎత్తగొట్టడం వంటి ప్రధానమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించే విషయంలో సరారు పూర్తిగా చేతులెత్తేయడంతోనే రైతులు తీవ్ర సంక్షోభంలో కురుకుపోతున్నాని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్ర వ్యవసాయ రంగం పూర్తిగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దికులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలనే సదుద్దేశంతోనే ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పదేండ్ల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. విస్తృత పర్యటనలు, అధ్యయనం తర్వాత పార్టీ తరపున రూపొందించే ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి రానున్న



బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలపై వారికి ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

## 200 నకిలీ నోట్ల చెలామణి

### రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్‌బిఐ

ముంబై,జనవరి21 స్టార్ త్రినేత్రం : ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీ డిప్యూటీ సీఎంకు పటిష్ట భద్రత

### డ్రోన్ ఎగిరివేతపై దర్యాప్తు చేస్తున్నాం : ద్వారకా తిరుమల రావు

**రాజమండ్రి,జనవరి21 స్టార్ త్రినేత్రం :**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పటిష్ట భద్రతను కల్పిస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ పవన్ భద్రతపై ప్రతీ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నామన్నారు. ఉపముఖ్యమంత్రి ఇంటిపై డ్రోన్ ఎగురవేయడంపై విచారణ చేస్తామని.. పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా? లేదా? అన్నది నిర్ధారిస్తామని చెప్పారు. ఇక పవన్ కళ్యాణ్ ఏజెన్సీ పర్యటనలో భద్రతాపరంగా ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ పర్యటన తర్వాత వచ్చిన వ్యక్తి ఎవరనే విషయంపైనా విచారణ జరుగుతుందని డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. సోమవారం ఉదయం రాజమండ్రిలో డీజీపీ పర్యటించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను ఆయన ప్రారంభించారు.



అనంతరం మాట్లాడిన డీజీపీ.. పవన్ భద్రత అంశాన్ని సీరియస్‌గా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరా ఎగిరిన ఘటనపై పోలీస్ శాఖ సీరియస్‌గా దర్యాప్తు చేస్తోందని.. నిన్న సాయంత్రానికి విచారణ పూర్తి కావాల్సి ఉందన్నారు. డ్రోన్ ఎగరడంపై పోలీసులు ముఖ్యమైన సమాచారాన్ని సేకరించారని తెలిపారు. అయితే ఈరోజు కూడా విచారణ కోసం కొంత సమయం కావాలని పోలీసులు అడిగారని.. నేటి సాయంత్రానికి డ్రోన్ కెమెరా ఎగిరిన అంశానికి సంబంధించి మొత్తం విచారణ పూర్తి అవుతుందని డీజీపీ తెలిపారు. గతంలో డిప్యూటీ సీఎం పవన్.. పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించిన సమయంలో ఒక నకిలీ పోలీసు ప్రత్యక్షం కావడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై మీడియా ప్రస్తావించగా.. ఈ రెండు అంశాలను వేరువేరుగా చూస్తున్నామని తెలిపారు. మన్యం జిల్లాలో పవన్ పర్యటనలో ఎటువంటి భద్రతా లోపం లేదని, కేవలం పర్యటన పూర్తి అయిన తర్వాతే నకిలీ పోలీసు వచ్చినట్లు పోలీసులు గుర్తించారని.. దానిపై కూడా విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరాను ఎవరు ఎగురవేశారు.. అసలు అది డ్రోన్ కెమెరానా కాదా అనేదానిపై ప్రాథమికంగా నిర్ధారణకు వస్తామని తెలిపారు. అసలు పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరా ఎగురవేసే అవకాశం ఉందా? లేదా అనేది పోలీసుల విచారణలో తేలుతుందని డీజీపీ ద్వారకా తిరుమల రావు పేర్కొన్నారు.

## భద్రాద్రి జిల్లాలో విషాద ఘటన

### బోధన చేస్తూ..గుండెపోటుతో టీచర్ హఠాన్మరణం

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి21 స్టార్ త్రినేత్రం :**


ప్రస్తుతకాలంలో రోజురోజుకీ గుండెపోటు మరణాలు ఎక్కువ అవుతున్నాయి. ఆ వయస్సు..ఈ వయస్సు అనే తేడా లేకుండా..చిన్న పిల్లలు నుంచి పెద్ద వయస్సు వరకు హార్ట్ స్ట్రోక్‌తో మరణిస్తున్నారు..ఇది ఆందోళన కలిగిస్తోంది..ఉరుకుల పరుగుల జీవితం, స్ట్రెస్ ఆహారపు అలవాట్లు ఇవ్వన్నీ గుండెపోటుకు కారణం అవుతున్నాయి..అప్పటి వరకు హుషారుగా పని చేస్తూ..అందరితో కలివిడిగా గడిపిన వారు ఒక్కసారిగా కుప్పకూలి మరణిస్తున్నారు.. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో క్లాస్ రూమ్‌లో పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు పిల్లి రమేష్(44) ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో మరణించాడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. దీంతో విద్యార్థులు ,తోటి ఉపాధ్యాయులు.. ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రమేష్ ప్రతి రోజూ ఖమ్మం నుంచి ఇల్లందు ప్రభుత్వ పాఠశాలకు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు.

## తిరుమలలో యధావిధిగా దర్శనాలు

### ఉత్తరద్వార దర్శనాలు ముగియడంతో నిత్య కౌంకర్యాలు

**తిరుమల,జనవరి21 స్టార్ త్రినేత్రం :**

శ్రీవారి ఆలయంలో సోమవారం నుంచి యధావిధిగా కౌంకర్యాలు, భక్తులకు దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు మూతపడ్డాయి. పదిరోజుల పాటు టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ పది రోజుల్లో దాదాపు 6 లక్షల 83 వేల 304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని.. ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల పదో తేదీన వైకుంఠ ద్వారాలను తెరిచిన విషయం తెలిసిందే. గతేడాది తరహాలోనే పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించారు. చివరిగా ఆదివారం అర్ధరాత్రి ఏకాంతసేవతో వైకుంఠ ద్వారాలను మూసివేశారు. ఇక సోమవారం నుంచి యధావిధిగా శ్రీవారి దర్శనాలు ప్రారంభ మయ్యాయి. తిరిగి ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి



రావడంతో టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. కాగా ఆదివారం చివరి రోజు కావడంతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. కేవలం దర్శనం టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ మేరకు ముందుగానే భక్తులకు టోకెన్లు, టికెట్లను కూడా టీటీడీ అధికారులు జారీ చేశారు. గత తొమ్మిది రోజులుగా టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం టీటీడీ కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలకు సంబంధించి 50వేల టోకెన్లను టీటీడీ ముందస్తుగా జారీ చేసింది. అలాగే ఆన్‌లైన్‌లో 15 వేల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కూడా జారీ చేసింది.ఆదివారంతో శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం ముగియనుండటంతో తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగింది. ఈనెల 10 నుంచి 19 వరకు అంటే దాదాపు పది రోజుల పాటు శ్రీవారి ఆలయంలో భక్తులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం కల్పించింది. రోజుకు 70 వేల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ అధికారుల ఏర్పాట్లు చేశారు. మరోవైపు టీటీడీ ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు కూడా ఒక ఉద్యోగికి ఐదు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను జారీ చేశారు. అలిపిరి చెక్ పాయింట్ వద్ద కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. భద్రతా సిబ్బంది కూడా తనిఖీలను వేగవంతం చేసి కార్లను తిరుమలకు పంపించారు.

## బాధిత కుటుంబానికి టెస్కాబ్ ఛైర్మన్ పరామర్శ

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పీఏసీఎస్ ఛైర్మన్ రాజేష్ ఖన్నా



స్టార్ త్రినేత్రం, పర్వతగిరి: పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో సోమవారం వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు అత్తమ్మ మరణించారు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, వర్ధన్నపేట పీఏసీఎస్ ఛైర్మన్ రాజేష్ ఖన్నా మంగళవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు ధర్మకర్త బందెల వెంకన్న, దొనికి కొమురయ్య, ఆడెపు కుమారస్వామి, ఉడుతబోయిన కృష్ణ, జక్కి గోపాల్, మాసాని యాకుబ్, తొర్రి కుమార్, వరంగల్ జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు

### క్రమశిక్షణా కమిటీకి వివరాలు ఇచ్చా
### ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

అమరావతి,జనవరి21 స్టార్ త్రినేత్రం : తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు...అందుకే వాస్తవాలన్నీ క్రమశిక్షణా కమిటీకి వివరాలు ఇచ్చానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 11న జరిగిన ఘటనపై తెదేపా క్రమశిక్షణ కమిటీ సభ్యులకు నేరుగా, రాతపూర్వకంగా తన వివరణ ఇచ్చానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. 'సోషల్ మీడియాలో వచ్చేది వేరు.. జరిగిన వాస్తవం వేరు. కంచె తొలగింపు ఘటన యాదృచ్ఛికంగా జరిగింది. కంచె ఉన్న విషయం అక్కడికి వెళ్లే వరకు తెలియదు. నాపై ఫిర్యాదు చేసిన వాళ్లే ఇవాళ నాతో కలిసి పనిచేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే వాళ్లను ఎవరూ దూరం పెట్టరు. తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు' అని కొలికపూడి అన్నారు. ఈ నెల 11న కొలికపూడి.. ఎ.కొండూరు మండలం గోపాలపురంలోని తెదేపా గ్రామ కార్యదర్శి భూక్యా రాంబాబు ఇంటికి వెళ్లారు. ఆ గ్రామంలో రాంబాబుకి, ఆయనకు వరుసకు సోదరుడయ్యే... వైకాపా నాయకుడు భూక్యా కృష్ణకు ఎప్పటి నుంచో ఆస్తి తగాదా ఉంది. ఇటీవల గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఆ రోడ్డు తన స్థలంలోనే వేశారని.. వివాదం తేలేవరకు రోడ్డుని ఎవరూ వినియోగించడానికి వీల్లేదని కృష్ణ దానిపై కంచె వేశారు. రాంబాబు ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆ రోడ్డు దగ్గరకు వెళ్లి కృష్ణ, ఆయన భార్య భూక్యా చంటిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు తమ ఇంట్లోకి వచ్చి తన భర్తను, తనను కొట్టారంటూ... భూక్యా చంటి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. తెదేపాలోని మెజార్టీ వర్గాలు కూడా ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నాయి. దీంతో సోమవారం ఎమ్మెల్యేను క్రమశిక్షణ సంఘం ముందుకు పిలిపించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణకు కొలికపూడి వివరణ ఇచ్చారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీల మృతి

తిరుపతి,జనవరి21 స్టార్ త్రినేత్రం : తిరుపతి జిల్లా రేణిగుంట-కడప ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తిరుమల శ్రీవారి దర్శించుకుని హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రేణిగుంట-కడప ప్రధాన రహదారిలోని కుక్కల దొడ్డి వద్ద ప్రైవేట్ బస్సును కారు ఢీకొనడంతో ఈ ఘటన సంభవించింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ అక్కడకక్కడే మృతి చెందారు. హైదరాబాద్ లోని పటాన్ చెరువుకు చెందిన సందీప్ (45) అంజలీదేవి(40)గా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న రేణిగుంట ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను ఆసుపత్రికి తరలిస్తున్నారు.

## అవినీతిమయంగా రేవంత పాలన

నిజామాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : రేవంత్ ప్రభుత్వ పాలన పూర్తి అవినీతి మయంగా మారిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ సంవిధాన గౌరవ ధివస్‌పై సోమవారం వర్క్ షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు దేశానికే గర్వకారణమని చెప్పారు. పసుపు బోర్డు సాధించిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 కుంభకోణాలు జరిగాయని.. వాటిని ఆధారాలతో సహా బయట పెట్టినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎఫ్.అర్.బి.ఎం పరిధిని దాటి విపరీతంగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అప్పులు చేసినప్పటికీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఎందుకు పూర్తిగా అమలు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థం కోసం పనిచేస్తే , బీజేపీ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఉత్తరాది భక్తుల కోసమే నమూనా ఆలయం

తిరుమల,జనవరి21 స్టార్ త్రినేత్రం : ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా సందర్భంగా శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలియజేశారు. ప్రయాగ్ రాజ్ లోని శ్రీవారి నమూనా ఆలయాన్ని టీటీడీ ఛైర్మన్ నాయుడు దంపతులు సోమవారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ ఈవో గుణ భూషణ్ రెడ్డి, స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర్వేద హవనంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది సంక్రాంతి నుండి శివరాత్రి వరకు 45 రోజుల పాటు జరుగుతున్న ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభ మేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 250 మంది టీటీడీ సిబ్బంది డిప్యూటేషన్ పై శ్రీవారి నమూనా ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తరాదిలో ధర్మ ప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఉత్తరాది భక్తులందరూ శ్రీవారిని నమూనా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయోధ్య శ్రీరాముడికి టీటీడీ తరపున తొలిసారిగా పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని, ఈ సందర్భంగా సరయూ నదీ తీరంలో స్వామివారికి వైభవంగా నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్ రెడ్డి, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

### నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

## యాదాద్రీశుడి ఆదాయం రూ.4,17,13,596

యాదగిరిగుట్ట,జనవరి21 స్టార్ త్రినేత్రం : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,17,13,596 లు చేకూరింది.గత 47 రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు పర్వం దేవస్థానం చేపట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో సోమవారం చేపట్టిన లెక్కింపులో ఆలయ ఉద్యోగులు,కల్యాణకట్ట సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు,భక్తులు,మహిళా సేవ సమాఖ్య బృందాలు పాల్గొన్నాయి. కొనసాగిన లెక్కింపులో నగదు రూ.4,17,13,596, మిశ్రమ బంగారం 229 గ్రాములు, వెండి7,050 గ్రాములు చేకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. ఎస్పీఎఫ్ జవాన్లు,సీసీ కెమెరాల నిఘా మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు పర్వం కొనసాగింది.

## బీడీ కార్మికుల ఆందోళన

నిజామాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : బీడీ కార్మికులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి నెలకు 4016 చెల్లించాలని కోరుతూ మెండోరాలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బీడీ కార్మికులు ఆందోళన చేశారు. స్థానిక మార్కెట్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడివో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఎంపిడీవో వనజ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ముతేన్న మాట్లాడు తు ఎన్నిక ల సమయం లో హామీ ఇచ్చి ఏడాది గడిచిన జీవన భృతి ని పెంచలేదని అన్నారు. ?4016 కు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పిఎఫ్ కల్గి ఉన్న బీడీ కార్మికులందరికి జీవన భృతి చెల్లించాలని అన్నారు. కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ధర్నా

నిజామాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : మెండోరా మండలం సోన్ పేట్ లో గ్రామభివృద్ధి కమిటీ కి చెందిన ఎకరం భూమిని ప్రభాకర్ అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పేర్కొంటూ గ్రామస్తులు సోమవారం మెండోరా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. గ్రామానికి చెందాల్సిన భూమి గ్రామానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై పోలీస్ స్టేషన్ లో సంప్రదించిన ఎస్ ఐ ప్రభాకర్ కు మద్దతుగా మాట్లాడుతున్నాడని విన్నవించారు. అక్రమ రిజిస్ట్రేషన్ పై చర్యలు తీసుకోని గ్రామభి వృద్ధి కమిటీ పేరా ఎకరం భూమి ని రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. తహసీల్దార్ సంతోష్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఆర్మూర్ గ్రామీణ సీఐ శ్రీధర్ రెడ్డి, ముప్కాల్ ఎస్ఐ రజనీకాంత్ లు వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ఆందోళన విరమించారు.

## త్రిలింగ రామేశ్వరుని దర్శించుకున్న మాలధారులు

నిజామాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : అతి పురాతన మహిమాన్విత శైవ క్షేత్రమైన తాండూరు త్రిలింగ రామేశ్వర స్వామి శివదీక్ష మాలధారులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది శివ స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు , అభిషేకాలు నిర్వహించారు. ఈ ఆలయం శివదీక్ష పరుల కీర్తనలతో మారు మోగింది. అనంతరం అన్న ప్రసాద వితరణను శివమాలదారులు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, శివదీక్ష స్వాములు పాల్గొన్నారు.

## కవితమ్మ డాక్టర్‌కు చూపించుకుంటే మంచిది

**పసుపుబోర్డు వ్యాఖ్యలపై రఘునందన్ రావు సెటైర్లు**

సంగారెడ్డి,జనవరి21 స్టార్ త్రినేత్రం : పసుపు బోర్డు తమ వల్లే వచ్చిందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు వేశారు. కవిత మంచి డాక్టర్ కు చూపెట్టుకుని తర్వాత మాట్లాడాలని సూచించారు. జైల్లో ఉన్నప్పుడు కవిత ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయి... చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది... మంచి డాక్టర్ కి చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుంది. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెడితే బాగుంటుందని రఘునందన్ రావు అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కి రైతులు ఎందుకు గుర్తుకు రాలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదు. అధికారం పోయాక రైతులపై కేటీఆర్ కి ప్రేమ పెరిగి రైతు ధర్నాలు చేస్తున్నాడని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాం లోనే అంబేద్కర్ కి అవమానం జరిగింది. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్ ని గౌరవించలేదు.కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు. 1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమ్జంగ÷న్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని రఘునందన్ రావు విమర్శించారు.

## దావోస్‌లో ఇద్దరు తెలుగు సిఎంల భేటీ

హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్తుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు మంత్రులు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం.. అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సీఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చిత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహననాయుడు ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భుజంపై చేతులేసి.. షేక్ హ్యాండ్ ఇస్తున్నారు సీఎం చంద్రబాబు. ఉదయం జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో వీళ్ల మీటింగ్ జరిగింది.తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా.. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది.

## రికార్డు సృష్టించిన డేర్‌డెవిల్స్ టీమ్

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం

న్యూఢిల్లీ,జనవరి21 స్టార్ త్రినేత్రం : ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకు దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్ ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతోపాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ (20.4 అడుగులు)ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు.. తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈ టీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1935 నుంచి ఇప్పటి వరకూ డేర్‌డెవిల్స్ టీమ్.. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీ డే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

## అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం : అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?



దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు.

కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబుడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యయసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

# మోడీకి మైనార్టీ...చంద్రబాబుకు మెజార్టీ

- బాబుకు కలసి వస్తున్న కూటమి ఏర్పాటు
- పురోగతిలో అమరావతి, విశాఖ స్టీల్, పోలవరం

**అమరావతి,జనవరి21 స్టార్ త్రినేత్రం :**



ఎన్‌డిఎలో భాగస్వామ్యం కావడం, మోడీ అత్తెసరు సీట్లతో గెలవడం ఎపి సిఎం చంద్రబాబుకు కలసి వస్తోంది. అయితే కొంతమేర ఎపి లభాపడుతుందనే చెప్పాలి. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్ విషయాల్లో ఎపి సిఎం చంద్రబాబు ఆచితూచి అడుగు వేయడం వల్ల కలసివస్తోంది. చంద్రబాబు అవసరం ఉంద ఇకనుక మోడీ కూడా కిక్కురుమనకుండా ఉంటున్నారు. లేకుంటే మోడీ తన విశ్వరూపం చూపేవారు. ఇలా అన్ని రాష్ట్రాలకు మోడీ చేయూతను ఇస్తే ఆయా రాష్ట్రాలు అభివృద్ధి చెందగలవు. ఇక్కడ ఆయన తనకు అవసరమున్న మిత్రులకు మాత్రమే అండగా ఉండాలను కోవడం వల్ల మిగతా రాష్ట్రాల్లో వ్యతిరేకత రాగలదు. అయితే కేంద్రంతో చేయి కలిపి నడవడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఆంధప్రదేశ్ నిలదొక్కుకుని బలపడాలంటే కేంద్ర సహకారం పూర్తిగా అవసరం. ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువిడుపులతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. తాజాగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి 11 వేల కోట్లకు పైగా ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు కూడా సజావుగా పూర్తికావడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఇటీవలే కేంద్ర బృందంకూడా ఇక్కడ పర్యటించి ప్రాజెక్టు వివరాలు సేకరించింది. మొత్తంగా ఈ మూడు అంశాలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉదారంగా వ్యవహరించారని చెప్పవచ్చు. కేంద్రంలో మోదీ సర్కార్ మూడవ పర్యాయం అధికారం చేపట్టడంలో తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకం కావడం వల్ల మాత్రమే ఇది సాధ్యమయ్యిందని చెప్పాలి. లేకుంటే మోడీ ఈ మాత్రం కూడా చేసేవారు కాదు. విశాకను తెగనమ్మడానికి నిర్ణయించుకున్నా ..అనివార్యంగా ప్యాకేజీ ప్రకటించక తప్పలేదు. తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చంద్రబాబు చాణక్యం ప్రదర్శిస్తున్నారు. గతంలో కేంద్రంతో విభేదించినందున ఏం జరిగిందో ఆయనకు తెలుసు. ఎన్‌డిఎతో విభేదించి బయటకు రావడం వల్ల ఎపిలో అధికారం పోయింది. తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చు కోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటిస్తూ..అనకువగా ఉంటున్నారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత కూడా ఎపి పురోభివృద్ధికి తోడ్పడుతోంది. అందుకే ప్రైవీటీకరించాలనుకున్న విశాఖ ప్లాంట్ విసయంలో మోడీ మనసు మార్చుకున్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం మోడీకి కూడా లాభించే విషయమే. రాజధాని అమరావతి నిర్మాణం కోసం కూడా కేంద్రం గత బడ్జెట్‌లో ఆర్థిక సాయం అందించింది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. మూడు రాజధానులు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన నష్టం కారణంగా ఎపి ఐదేళు వెనకబడి పోయింది. అమరావతిని జగన్ పూర్తి చేసివుంటే ఆ ఖ్యాతి ఆయనకే దక్కేది. రాజధానిపై విషం చిమ్మిన పాపానికి జగన్ భారీ మూల్యం చెల్లించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమం అందాలన్నా రాజధాని లాంటి అద్భుత నగరం ఉండాల్సిందే. అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా నుంచి ప్రభుత్వానికి 20 శాతం వరకు పన్నుల రూపంలో వెనక్కు వస్తోంది. మొత్తంగా విశాఖ పునరుద్దరణ జరిగి లాభాల్లో ప్లాంట్ నడిచేలా చేయగలగాలి. అలాగే ఈ నాలుగున్నరేళ్ల కాలంఓ అమరావతిని పూర్తి చేయాలి. పోలవరం కూడా ఇదే సమయంలో పూర్తి కాగలగాలి. గత 14 ఏళ్లచంద్రబాబు పాలనకన్నా, ఈ ఐదేళ్ల పాలనే బాబుకు పరీక్ష. ఇవన్నీ చేయగలిగితనే ప్రజలు నమ్ముతారు.

## జగిత్యాల ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన

**చావు బతుకుల్లో ఉన్న వ్యక్తిని పట్టించుకోని వైద్యులు**

**జగిత్యాల,జనవరి21 స్టార్ త్రినేత్రం :**

జగిత్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ప్రాణం పోయాల్సిన వైద్యులే పట్టనట్లుగా వ్యవహరించారు. బెడ్ పై నుంచి కిందపడి ఓ రోగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. ఎంతమందిని పిలిచినా ఎవరు స్పందించలేదు. గంటకు పైగా భూమయ్య బెడ్ కిందే పడిపోయి నరకయాతన అనుభవించాడు. నేను చచ్చిపోతున్న పట్టించుకోవాలని రోదించినా దవాఖాన సిబ్బందిలోని ఏ ఒక్కరి హృదయాన్ని కదిలించలేక పోయింది. ఆయన ఆర్తనాదం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానులు నేడు పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు




**హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం :**

తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.


# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

- కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు
- మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్
- అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచాం : మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్,జనవరి21 స్టార్ త్రినేత్రం :**



ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం.




# ఏసుబాయిగా రష్మిక

## ఆకట్టుకుంటున్న న్యూగెటప్

పుష్ప ఫ్రాంచైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా. గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. కథానుగుణంగా సినిమా పూర్తిగా మరాఠి భాషలో సాగనుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో రష్మిక మరాఠి భాష నేర్చుకుందని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. మ్యాడ్‌డాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.

# ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన సినీహీరో నాగచైతన్య



టాలీవుడ్ యాక్టర్ నాగచైతన్య ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో సందడి చేశాడు. తన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవడానికి ఆర్టీవో కార్యాలయానికి వచ్చాడు. నాగచైతన్య రెన్యూవల్ కోసం ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేశ్‌ను కలిశాడు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు నాగచైతన్యను డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు తెలుసుకుని రెన్యూవల్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైతూను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆర్టీవో కార్యాలయానికి తరలివచ్చారు. నాగచైతన్య ప్రస్తుతం తండేల్ సినిమాలో నటిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీకి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ షురూ చేసేందుకు రెడీ అవుతున్నారు.

# ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన సైఫ్






బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గత వారం సైఫ్ ఇంటికి చోరీకి వచ్చిన దుండగుడు నటుడిపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి అనంతరం తీవ్ర గాయాలతో లీలావతి ఆసుపత్రిలో చేరారు. అక్కడ ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరు రోజుల చికిత్స అనంతరం ఇవాళ డిశ్చార్జ్ అయ్యారు. వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని సైఫ్‌కు వైద్యులు సూచించారు. అదేవిధంగా ఇన్ఫెక్షన్ అవ్వకుండా ఉండేందుకు ఎక్కువమంది ఆయన వద్దకు రాకుండా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈనెల 16న సైఫ్ ఇంటికి చోరీకి వెళ్లిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరుసార్లు సైఫ్‌ను దుండగుడు కత్తితో పొడిచాడు. గురువారం తెల్లవారుజామున 2:30 ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నటుడికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. మరోవైపు సైఫ్‌పై దాడి కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను శనివారం అర్ధరాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేసి విచారిస్తున్నారు. విచారణలో భాగంగా క్రైమ్‌సీన్ రీక్రియేషన్ కోసం నిందితుడిని సైఫ్ ఇంటి వద్దకు తీసుకెళ్లారు. నిందితుడి వేలిముద్రలను కూడా తీసుకున్నారు.

# హైదరాబాద్ సీపీ మళ్లీ ఫిర్యాదు చేసిన మాధవీలత



బీజేపీ నేత, సినీ నటి మాధవీలత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం మరింత ముదురుతోంది. తనను ప్రాస్టిట్యూట్ అంటూ పరుష పదజాలంతో దూషించిన జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఇప్పటికే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మాధవీలత ఇప్పటికే ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. జేసీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీ మాటలతో తాను, తన కుటుంబం ఎంతగానో ఇబ్బంది పడిందని ఈ సందర్భంగా మాధవీలత అన్నారు. క్షమాపణ చెప్పానంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. నాయకులు ఇలాంటి భాష మాట్లాడితే ఎలా అని నిలదీశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ పార్క్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. అయితే ఆ వేడుకలకు వెళ్లవద్దని.. అక్కడ మహిళలకు రక్షణ ఉండదని మాధవీలత ఒక వీడియో రిలీజ్ చేశారు. దీనిపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మాధవీలత ఒక సినిమా యాక్టర్ అని.. యాక్టర్స్ అంతా ప్రాస్టిట్యూట్స్‌నే అని పరుష పదజాలంతో విమర్శించారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. దీనిపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. దీంతో వెనక్కి తగ్గిన జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. తన వయసు 72 సంవత్సరాలు అని.. ఆవేశంలో అలా మాట్లాడానే తప్ప ఎవరినీ కించపరచాలనే ఉద్దేశంతో మాట్లాడలేదని వివరించారు. ఎవరి బతుకుదెరువు వారిదేనని అన్నారు. మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని తెలిపారు. మాధవీలతను క్షమాపణలు కోరారు. జేసీ ప్రభాకర్ రెడ్డి క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం ముగిసిపోతుందని అంతా అనుకున్నారు. కానీ మాధవీలత మాత్రం జేసీని క్షమించలేదు. ఆ విషయాన్ని ఎంతలా మరిచిపోదామన్న తన వల్ల కావడం లేదని అప్పట్లోనే ఒక వీడియోను కూడా రిలీజ్ చేశారు. ' చాలా ప్రయత్నం చేశా.. కానీ నేను మనిషినే.. నా ఆత్మ గౌరవం మీద జరిగిన దాడి.. నాకున్న బాధను వర్ణించే పదాలు లేవు. ప్రతిక్షణం వేదనతో నిండి ఉంది. కోపం, నిరాశ, ఆవేదన, దుఃఖం.. అన్నీ ఒకేసారి నన్ను కుదిపేస్తున్నాయి.' అని మాధవీలత అన్నారు. ఎన్నోసార్లు ఎందరో తన ఆత్మవిశ్వాసాన్ని చిదిమివేయాలని ప్రయత్నం చేశారని.. పదే పదే ఇవే మాటలన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇటీవల జేసీ ప్రభాకర్ రెడ్డిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), ఫిలిం ఛాంబర్‌లో మాధవీలత ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు.

# బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం : దిల్‌రాజ్ భార్య



ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, ఆఫీసుల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసిందే. హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు చేపట్టాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దిల్ రాజు భార్య తేజస్వినిని అధికారులు బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తేజస్విని మీడియాతో మాట్లాడుతూ.. ఇవాళ ఉదయం నుంచి ఐటీ సోదాలు జరుగుతున్నాయన్నారు. బ్యాంకు వివరాలు కావాలని అధికారులు అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామని చెప్పారు. దిల్ రాజు నివాసాలతోపాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి ఇండ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. దిల్ రాజు వ్యాపార భాగస్వాముల నివాసాలతోపాటు పుష్ప 2 సినిమా నిర్మాత నవీన్ ఎర్నేని, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో కూడా ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి



# గోపీచంద్ సినిమా కోసం నలుగురు డైరెక్టర్లు

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వస్తున్న చిత్రం జాట్. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా నటిస్తున్నాడు. ఎస్‌డీజీఎం ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. రెజీనా కసాండ్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ సినిమాలో హైఆక్టేన్ యాక్షన్ స్టంట్స్ థ్రిల్ అందించబోతున్నాయట. అంతేకాదు తాజా టాక్ ప్రకారం ఈ సినిమా కోసం ఏకంగా నలుగురు యాక్షన్ డైరెక్టర్లు పనిచేస్తున్నారు. అనల్ అరసు, రామ్-లక్ష్మణ్, నాగవెంకట్, పీటర్ హెయిన్స్ టీం జాట్ కోసం ఇంటెన్స్ ఫైట్ సీక్వెన్స్, యాక్షన్ సీన్లను రెడీ చేస్తుందని ఇన్‌సైడ్ టాక్. గోపీచంద్ మలినేని నుంచి ఎలాంటి యాక్షన్ మూవీ వస్తుందో చెప్పేందుకు ఈ ఒక్క అప్‌డేట్ చాలు. ఇటీవలే విడుదలైన ట్రైలర్ సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా విలన్‌గా నటిస్తున్నాడు. ఈ మూవీకి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రానికి రిషి పంజాబి సినిమాటోగ్రాఫర్. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్.గోపీచంద్ మలినేని బీటౌన్ జాట్ సినిమాతో డెబ్యూ ఇస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.